క్లుప్తంగా

సన్మానం



కాటారం: చార్టెర్డ్ అకౌంట్ ఫలితాల్లో మండలం లోని ప్రతాపగిరి గ్రామపంచాయతీ పరిధిలోని దేవునిపల్లికి చెందిన చెవుల రంజిత్‌కుమార్ ఉత్తమ ఫలితం సాధించడంతో ప్రతాపరుద్ర వెల్ఫేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. శాలువాతో సత్కరించి షీల్డును అందజేశారు. అనాథ పిల్లల సహాయార్థం కృషి చేస్తున్న ప్రతాపరుద్ర ఫౌండేషన్‌కు ఈ సందర్భంగా రంజిత్‌కుమార్ తనవంతు సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు మెండ మల్లయ్య, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ చెవుల దేవేందర్, ముక్కెర తిరుపతి, ముఖ్య సలహాదారుడు వేముల సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

126 దరఖాస్తుల స్వీకరణ

మల్హర్: ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు రెండు రోజుల పాటు నిర్వహించిన స్పెషల్ క్యాంపెన్‌లో భాగంగా మండల వ్యాప్తంగా 126 మంది నూతనంగా ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. శనివారం, ఆదివారం మండలంలోని ఆయా గ్రామాల్లోని బీఎల్‌ఓ కేంద్రాల్లో అభ్యర్థుల నుండి కొత్త ఓటరు నమోదు, మార్పులు, చేర్పులపై బీఎల్‌ఓలు దరఖాస్తులు స్వీకరించినట్లు వెల్లడించారు.

దరఖాస్తుల గడువు పొడిగింపు

కాటారం: గురుకుల పాఠశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతిలో ప్రవేశం కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 23 వరకు పొడిగించినట్లు కాటారం సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల అప్‌గ్రేడ్ కళాశాల ప్రిన్సిపాల్ విజయ లలిత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎస్సైని కలిసిన నాయకులు



రేగొండ: రేగొండ ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన రవికుమార్‌ను బీఆర్‌ఎస్ కొత్తపల్లిగోరి మండల అధ్యక్షుడు మటిక సంతోష్ ఆధ్వర్యంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానించారు. సర్పంచ్ పాతపల్లి సంతోష్, ఎంపీటీసీ హమీద్ నాయకులు చిగురుమామిడి రాజు, అమ్ముల రాజయ్య, రఘుసాల తిరుపతి, విష్ణు, శంకర్, సుమన్, నరెడ్ల కుమారస్వామి, నవీన్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సీతారాముడి వేషధారణలో చిన్నారులు



ఏటూరునాగారం: మండల కేంద్రానికి చెందిన శ్రీనివాస్ మాధురి దంపతుల చిన్నారులు దాక్షి జియా, నివాన్షిలను సీతారాముడి వేషధారణలో ఆదివారం అలంకరించారు. నేడు(సోమవారం) అయోధ్యరామయ్య విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా శ్రీరాముడు, సీతాదేవి లాగా వేషధారణ వేసి భక్తిని చాటుకున్నారు.

నేడు ఆలయంలో పూజలు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం మద్దులపల్లి గ్రామంలోని హనుమాన్ ఆలయంలో సోమవారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు భక్తులు నిట్టూరి రాకేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ జరుగుతున్న నేపథ్యంలో ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

రేగొండ: ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు నేడు (సోమవారం) కొత్తపల్లిగోరి మండలంలో పర్యటించనున్నట్లు ఎంపీడీఓ సురేందర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని వెంకటేశ్వర్లపల్లి, గాంధీనగర్, విజ్జయ్యపల్లి గ్రామాలకు మంజూరైన నూతన గ్రామపంచాయతీ భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు.

సీనియర్ జర్నలిస్టు మృతి

భూపాలపల్లి అర్బన్: అనారోగ్యంతో బాధపడుతూ సీనియర్ జర్నలిస్టు రాచర్ల ప్రభాకర్ ఆదివారం తెల్లవారు జామున మృతి చెందారు. 30 ఏళ్ల పాటు ప్రభాకర్ వివిధ పత్రికల్లో సేవలందించారు. హైదరాబాద్‌లో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, స్థానిక జర్నలిస్టులు జిల్లా కేంద్రం రాజీవ్‌నగర్‌లో మృత దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అధ్వానంగా మురుగు కాల్వలు



చెత్తాచెదారంతో నిండి ఉన్న మురుగు కాల్వ





6వ వార్డులోని కాల్వల్లో నిల్వ ఉన్న మురుగు నీరు

- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ఆరో వార్డులో మురుగు కాల్వలు అధ్వానంగా ఉన్నాయి. ఎక్కడి చెత్తాచెదారం అక్కడే ఉండడంతో కాల్వల్లో వ్యర్థాలు పెరిగిపోయి మురుగు బయటకు వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో దోమలు విపరీతంగా పెరిగిపోయి జ్వరాల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల పంచాయతీ ట్రాక్టర్ వచ్చినప్పటికీ తాము చెత్తాచెదారం ఎత్తబోమని గ్రామ పంచాయతీ సిబ్బంది చెప్పడంతో స్థానిక ప్రజలే చెత్తాచెదారం ఎత్తిపారబోసుకోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాల్వల నిర్మాణం చేపట్టి దోమలు, దుర్వాసన లేకుండా చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఇబ్బంది పడుతున్నాం..



ఆరో వార్డులో కాల్వల నిర్మాణం చేపట్టాలి. దోమలతో ఇబ్బంది పడుతున్నాం. ఎవరు పట్టించుకోవడం లేదు. దోమల వల్ల ఇంటింటికీ జ్వరాలే ఉంటున్నాయి. వార్డు సభ్యుడు కనిపించకుండా తిరుగుతున్నాడు.

– జాడి నర్సింగరావు, గ్రామస్తుడు

నీటిని తొలగించాలి



కాల్వల్లోని మురుగు నీటిని తొలగించాలి. వ్యర్థాలతో ఎక్కడి నీరు అక్కడే ఆగిపోతుంది. దుర్వాసన వస్తుంది. పట్టించుకునే నాథుడే కరువయ్యారు. దోమలు, దుర్వాసనతో నానా అవస్థలు పడుతూ జీవిస్తున్నాం.

– జనగాం దుర్గ, ఏటూరునాగారం

అధికారులు స్పందించాలి



ఇంటి ముందు చెత్తాచెదారం ఉంటే గ్రామ పంచాయతీ సిబ్బంది తీయటం లేదు. స్వయంగా తామే చెత్తను ఎత్తి ట్రాక్టర్‌లో వేస్తున్నాం. మురుగు కాల్వల్లో చెత్తాచెదారం తొలగించకపోవడంతో మా ఇంటి ముందు నేనే తొలగించుకున్నా. కానీ నీరు ముందుకు వెళ్లడం లేదు. గ్రామ పంచాయతీ పాలకులు, అధికారులు స్పందించి కాల్వల్లో నీరు వెళ్లేలా చూడాలి.

– బొగ్గం లక్ష్మి, ఏటూరునాగారం

'దళిత బంధు' నిధులు విడుదల చేయాలి



మహేష్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఏటూరునాగారం: రెండో విడత దళిత బంధు లబ్ధిదారుల ఖాతాల్లో వెంటనే నిధులను విడుదల చేయాలని దళిత బంధు సాధన సమితి జిల్లా అధ్యక్షుడు కోకిల మహేష్ అన్నారు. ఆదివారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో జరిగిన దళిత బంధు లబ్ధిదారుల సమావేశానికి మహేష్ హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వం ఉన్నప్పుడు కలెక్టర్ ఆధ్వర్యంలో ఎంపిక, గ్రౌండింగ్ ప్రక్రియను పూర్తి చేసి కలెక్టర్ ఎకౌంట్లో రూ.26 కోట్ల 49 లక్షలు జమ చేయడం జరిగిందన్నారు. అలాగే గ్రామపంచాయతీ ఎంపీడీవో కార్యాలయంలో డాటా ఎంట్రీని పూర్తి చేసి అధికారులు బ్యాంకుల్లో ఎకౌంటు కూడా తీయించారని ఎలక్షన్ కోడ్ వల్ల ప్రక్రియ నిలిపి వేశారన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిందని, విడుదలైన నిధులను వెంటనే లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయాలని అన్నారు. ఈ మేరకు నూతన ప్రభుత్వం మీద శాంతియుత కార్యక్రమాల ద్వారానే ఒత్తిడి తీసుకొని మంజూరు అయ్యేలా చేయాలన్నారు. ఇందు కోసం జిల్లా కేంద్రంలో గాంధీ పార్క్ వద్ద ఒక రోజు దీక్ష కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం మహేష్‌ను నాయకులు సన్మానించారు. శ్యాంబాబు, రమేష్, రాంబాబు, కాళ్ల రామకృష్ణ, సంజీవ, చిన్ని కృష్ణ, రాజేష్, చంద్రబాబు, రవి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే గండ్ర

టేకుమట్ల: బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, మండల మాజీ అధ్యక్షుడు కత్తి సంపత్ గౌడ్, మండలంలోని రామకిష్టాపూర్(టి) సర్పంచ్ గునిగంటి మహేందర్ ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో వంగ రాంబాబు, ఎక్కటి రాజేందర్‌రెడ్డి, గాజు కుమార్, చేపూరి రత్నాకర్, హరిఓం రాజు, బండెల రాజేందర్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్, వైనాల రవీందర్, కృష్ణారెడ్డి, దాసారపు సదానందం, వంగ నరేష్, చిరంజీవి, శాస్త్రాల కిరణ్, కిరన్ రావు, బుచ్చయ్య, స్వామిరావు, సారయ్య, కట్ల సదయ్య, పెసరు రాజేష్, యశ్వంత్ బోండ్ల మహేష్, సదానంధం, అచ్చె సంతోష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా బీఆర్‌ఎస్



పరామర్శిస్తున్న నాగజ్యోతి

ఎస్ఎస్‌తాడ్వాయి: బాధిత కుటుంబాలకు బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని జెడ్పీ చైర్ పర్సన్ బడే నాగజ్యోతి అన్నారు. ఆదివారం మండలంలోని లింగాల గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు ఊకె వీరస్వామి గుండెపోటుతో మృతి చెందగా ఆదివారం పార్టీ నాయకులతో కలిసి జెడ్పీ చైర్ పర్సన్ నాగజ్యోతి పరామర్శించారు. బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యం అందించారు. అలాగే అదే గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన ఊకే బుచ్చమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 2వేలు ఆర్థిక సాయం అందజేశారు. సర్పంచ్ మౌనిక, మాజీ వైస్ ఎంపీపీ పాయం నర్సింగరావు, నాయకులు చెన్నూరి కన్నయ్య, చేల సారయ్య, నాగేశ్వరరావు ఊకే సమ్మక్క, నర్సయ్య, దూలం చంద్రయ్య, ఊకే జగన్ రాంబాబు, ఉకే రమేష్, రషీద్, పాయం నారాయణ, ప్రశాంత్ పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక



ఎన్నికైన కమిటీ సభ్యులు

ఏటూరునాగారం: తెలంగాణ స్టేట్ జూనియర్ ఫారెస్టు అసోసియేషన్ ఏటూరునాగారం, వెంకటాపురం(కె) డివిజన్ వన్యప్రాణి మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నిక ఆదివారం పస్రాలో నిర్వహించారు. ఏటూరునాగారం, వెంకటాపురం(కె) వన్యప్రాణి డివిజన్ అధ్యక్షుడిగా ఏటూరునాగారం డీఆర్‌ఓ నరేందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా రాజేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రంజిత్‌నాయక్, ఉపాధ్యక్షులుగా లలితకుమారి, సహాయ కార్యదర్శిగా శేషుకుమార్, కోశాధికారిగా రూప్‌సింగ్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను అటవీశాఖ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు.

ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు పూర్తి

చిట్యాల: మండల కేంద్రంలోని రామాలయం వద్ద సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు హనుమాన్ భజన మండలి కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. మండల కేంద్రంలోని రామాలయం వద్ద స్క్రీన్‌ల ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు కమిటీ సభ్యులు నేపాలి వేణు పేర్కొన్నారు. కావున మండల కేంద్రంలోని భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. బుర్ర సదయ్య, నరేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



రామాలయం వద్ద చేసిన ఏర్పాట్లు

బియ్యం అందజేత



బియ్యం అందజేస్తున్న తస్లీమా మహ్మద్

ములుగు రూరల్: మండంలోలని సర్వాపూర్, రాంచంద్రాపూర్ గ్రామాలకు చెందిన గుండ్ల నర్సమ్మ, బానోత్ బాబురావు ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ ఆదివారం పరామర్శించి 50 కేజీల బియ్యం, రూ.వేయి ఆర్థిక సాయం అందించారు. ఆమె వెంట ముంజాల భిక్షపతిగౌడ్, సర్వర్ చారిటబుల్ ట్రస్టు సభ్యులు ఉన్నారు.

నేడు శ్రీమత్స్యగిరిస్వామి ఆలయంలో హోమం



సమావేశంలో మాట్లాడుతున్న భిక్షపతి

శాయంపేట : మండల కేంద్రంలోని శ్రీమత్స్యగిరిస్వామి దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించి హోయం నిర్వహించనున్నట్లు అలయ కమిటీ చైర్మన్ సామల భిక్షపతి తెలిపారు. అయోధ్య రామమందిరంలో బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉదయం 8 గంటలకు బైక్ ర్యాలీ, 9గంటలకు స్వామివారికి అభిషేకం, 10 గంటలకు హోమం, 10.30 గంటలకు అయోధ్యలో జరిగే ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం లైవ్ అనంతరం మహాఅన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం 4గంటల నుంచి మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా స్వామివారి శోభాయాత్ర నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గ్రామస్తులు ఇళ్లను శుభ్రం చేసుకోవాలని కోరారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు, గ్రామస్తులు సురేష్, నాగరాజు ఉన్నారు.

చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న బాబా ఖాన్

ములుగు రూరల్: నిరుపేదలకు అండగా అమ్మ బాబా ఖాన్ ఫౌండేషన్ ఉంటుందని ఫౌండేషన్ చైర్మన్ బాబా ఖాన్ అన్నారు. ఆదివారం మండలంలోని జంగాలపల్లి క్రాస్‌రోడ్డులో నిరుపేద మహిళలకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో చీరల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇబ్రహీం, జూపాక శ్రీకాంత్, విష్ణు, పాషా, సొహెల్, చరణ్, ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఎస్సైకి తీవ్రగాయాలు

మహదేవపూర్: రోడ్డు ప్రమాదంలో టీఎస్పీ ఎస్సై వినోద్‌కుమార్‌కు తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని జాతీయ రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాళేశ్వరంలో అంతరాష్ట్ర చెక్ పోస్టు వద్ద టీఎస్పీ ఎస్సైగా పనిచేస్తున్న వినోద్‌కుమార్ మహదేవపూర్ మండలం ఎలికేశ్వరం గ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో మహదేవపూర్ పెట్రోల్‌పంపు సమీపంలో రహదారిపై నిలిపి ఉంచిన లారీని ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం ఎంజీఎం వరంగల్‌కు తీసుకువెళ్లినట్లు తెలిపారు. కాగా లారీని అదుపులోకి తీసుకోని పోలీస్‌స్టేషన్‌లో ఉంచినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం



మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న సూర్య

ములుగు: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని మంత్రి సీతక్క కుమారుడు కాంగ్రెస్ పార్టీ యువజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్య అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని తంగేడు స్టేడియంలో ఆదర్శయూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలకు ముఖ్య అతిథిగా ఆయన హాజరైయ్యారు. ఈ సందర్భంగా ములుగు వర్సెస్ దేవగిరి పట్నం మధ్య జరిగే ఫైనల్ మ్యాచ్‌ను ప్రారంభించారు. అనంతరం సూర్య మాట్లాడుతూ.. క్రీడలతో స్నేహ భావం పెంపొందుతుందని అన్నారు. క్రీడా స్ఫూర్తితో ఆటలు ఆడి విజయం సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బానోత్ రవిచందర్, జిల్లా కాంగ్రెస్ నాయకులు బాదం ప్రవీణ్, కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు వంగ రవి యాదవ్, పట్టణ అధ్యక్షుడు చింతనిప్పుల భిక్షపతి, నాయకులు కుతుబుద్దిన్, గండె శ్రీను, కోటి, ఓడ రాజు, బండి మధు, శ్రీకాంత్ రెడ్డి, రాజు తదితరులు ఉన్నారు.

పెసా గ్రామ సభను రద్దు చేయాలి



మాట్లాడుతున్న రామ చందర్

వాజేడు: భువనపల్లి భీమవరం పెసా గ్రామ సభను వెంటనే రద్దు చేయాలని ఆదివాసీ ఐక్య సంఘాల నాయకుడు పూనెం రామ చందర్ కోరారు. ఆదివారం మండల పరిధిలోని భువనపల్లి, భీమవరం గ్రామాలను ఆదివాసీ ఐక్య సంఘాల నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పూనెం రామ చందర్ మాట్లాడుతూ.. భువనపల్లి, భీమవరం రెండు వేరు వేరు పెసా హ్యాబిటేషన్లు అయినప్పటికీ రెండింటిని ఒక్కటిగా చూపిస్తూ ఈ నెల 18న అధికారులు పెసా గ్రామ సభను నిర్వహించారన్నారు. భీమవరం గ్రామంలో ఇసుక క్వారీకి సర్వే నిర్వహించి భీమవరం ఆదివాసీ కుటుంబాలతో పీసా గ్రామ సభను నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. పూనెంరామ చందర్‌తో సోమరాజు, రాజబాబు, మల్లి ఖార్జున్, లక్ష్మి, శాంత, ధనమ్మ, నీలమ్మ, గున్నక్క, చందర్ రావు, రామా రావు, సమ్మయ్య, సుబ్బయ్య ఉన్నారు.

త్రివిక్రమ్ శ్రీనివాస్‌పై చర్య తీసుకోవాలి



నిరసన తెలుపున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ములుగు రూరల్: మార్క్సిస్టు మహోపాధ్యాయులు దోపిడి, పీడనకు వ్యతిరేకంగా ఉద్యమాలు నడిపిన మార్క్స్, లెనిన్ పేర్లను గుంటూరు కారం సినిమాలో విలన్‌ల పాత్రలకు పెట్టి అవమానపరిచారని, త్రివిక్రమ్ శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తోకల రవి, కల్లుగీతా కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండబోయిన రవిగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సినిమా విలన్ పాత్రలకు మార్క్స్, లెనిన్ పేర్లను వెంటనే తొలింగించాలని, తెలుగు ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవితైజ, స్వామి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి



తిరుమలకు పాదయాత్ర చేస్తున్న గండ్ర జ్యోతి

నల్లబెల్లి: ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని తిరుమల తిరుపతికి పాదయాత్ర చేపట్టిన జెడ్పీ చైర్ పర్సన్ గండ్ర జ్యోతి బృందం ఆదివారం మండలానికి చేరుకోగా.. స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు పుష్పగుచ్ఛం అందించి ఘనంగా స్వాగతం పలికారు. మండలంలోని బొల్లోనిపల్లి, రాంతీర్థం, బిల్‌నాయక్ తండా, శనిగరం, రుద్రగూడెం, నారక్కపేట గ్రామాల మీదుగా పాదయాత్ర బృందం నర్సంపేట మండలానికి చేరింది. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ లోక కల్యాణార్థం భూపాలపల్లిలో వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణం పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకొని మొక్కులు తీర్చుకునేందుకు పాదయాత్రగా తిరుమల తిరుపతికి వెళ్తుతున్నట్లు తెలిపారు. స్వాగతం పలికిన వారిలో జెడ్పీ వైస్‌చైర్మన్ ఆకుల శ్రీనివాస్, ఎంపీపీ ఊడుగుల సునిత, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి, ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి కోటిలింగాచారి, మాజీ జడ్పీటీసీ బానోత్ హరినాద్ సింగ్, నర్సంపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పాలెపు రాజేశ్వర్ రావు, మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్, సర్పంచ్ ఊరటి అమరేందర్, గోనెల పద్మ, ఎండీ.నజీమా బేగం, తదితరులు ఉన్నారు.

శాయంపేట : తిరుమల తిరుపతికి పాదయాత్రగా బయలుదేరిన జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతికి ఆదివారం మండలంలోని రాజుపల్లి, గంగిరేణిగూడెం, కాట్రపల్లి మీదుగా మల్లంపల్లి వరకు పాదయాత్ర కొనసాగింది. దీంతో గ్రామస్తులు గండ్ర జ్యోతికి మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ రాంశెట్టి లతాలక్ష్మారెడ్డి, నాయకులు ఆకుతోట సమ్మిరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు పైనే మురుగు నీరు



రోడ్డుపైనే నిలిచిన మురుగు నీరు

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా ఉన్న రోడ్డుపై మురుగు నీరు నిల్వ ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డుకు ఇరువైపులా ఉన్న మురికి కాల్వల్లో చెత్త పేరుకుపోవటంతో మురుగు రోడ్లపై చేరి కంపు కొడుతుందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డుపై వెళ్లేందుకు పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై పలుసార్లు మండల అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన పట్టించుకోవటం స్థానికులు వాపోతున్నారు. ప్రతి నిత్యం మండల పరిషత్ కార్యాలయానికి అధికారులు వచ్చి వెళ్తున్న రోడ్డుపై నిలిచి ఉన్న నీరును పటించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపై నిలిచిన మురుగునీటిని తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.